

వైవీయూ ఇన్‌ఛార్జి విసిగా ఆచార్య అల్లం శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి ఉప కుపలతిగా ఆచార్య అల్లం శ్రీనివాసరావు నియమితులయ్యారు. నెల్లూరు విక్రం సింహపురి విశ్వవిద్యాలయం విసిగా పనిచేస్తున్న ఆయనను వైవీయూ ఇన్‌ఛార్జి విసిగా నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఆర్డర్ ద్వారా ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకూ వైవీయూ విసిగా పనిచేసిన ఆచార్య ఫణతి ప్రకాష్ బాబు పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ విసిగా నియమితులయ్యారు. ఆయనను ఇక్కడి నుంచి రిలీవ్ చేశారు. ఆయన స్థానంలో నూతన ఇన్‌ఛార్జి విసిగా ఆచార్య శ్రీనివాసరావు ఒకటి, రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు ప్రారంభం

- కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు
- తనిఖీ చేసిన రాష్ట్ర అధికారి, డిఇఒ

హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి - కడప అర్బన్

పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం 9:30 గంటలకు పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు కావడంతో విద్యార్థులు తమ తల్లిదండ్రులు, సోదర, సోదరీమణులతో పరీక్షా కేంద్రానికి హాజరయ్యారు. గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. పోలీసులు విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి లోనికి పంపించారు. కేంద్రాల వద్ద ఎస్పి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్‌ను మూసివేశారు. రాష్ట్ర కేంద్రం నుంచి జిల్లా పరిశీలనకు వచ్చిన మధుసూదనరావు మూడు సెంటర్లను, డిఇఒ షంషుద్దీన్ ఆరు సెంటర్లను, ఏడుగురు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 54 సెంటర్లను తనిఖీ చేశారు. జిల్లావ్యాప్తంగా 160 సెంటర్లలో పరీక్షలు నిర్వహించగా రెగ్యులర్ విద్యార్థులు 27,800 మంది హాజరు కావాల్సి ఉండగా 27,648 మంది హాజరయ్యారు. 152 మంది గైర్హాజరయ్యారు. ప్రయివేట్ విద్యార్థులు 51 మందికి గాను 401 మంది హాజరయ్యారు. పదిమంది గైర్హాజరయ్యారు.

పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు

జిల్లా వ్యాప్తంగా సోమవారం ప్రారంభమైన పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద ఎస్పి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ప్రత్యేక పోలీసు బృందాలచే పరీక్షా కేంద్రాల వద్ద పెట్రోలింగ్ చేపట్టడం, పరీక్షలలో పాల్గొనే విద్యార్థులు, పరీక్షల నిర్వహణ, స్కూళ్ల సిబ్బంది మినహా ఎవర్నీ ఆ పరిసర ప్రాంతాల్లోకి రాకుండా చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల్లోకి వెళ్లే విద్యార్థులు ఎలాంటి సెల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాల్లోకి తీసుకెళ్లకుండా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. పరీక్షలు సజావుగా, సాఫీగా జరగడానికి జిల్లా యంత్రాంగంతో కలిసి పోలీసు శాఖ తరపున అన్ని కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.

పదవ తరగతి పరీక్షా కేంద్రం వద్ద పోలీసుల బందోబస్తు

న్యాయం జరగలేదంటూ

యువకుడు ఆత్మహత్యాయత్నం

- అడ్డుకున్న పోలీసులు
- ఆపరేషన్ చేసిన డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి
- తప్పుడు రిపోర్ట్ ఇచ్చిన డిఎంహెచ్‌ఒపై కఠిన చర్యలు తీసుకోవాలి
- బాధితుడు విశ్వనాథరెడ్డి

కలెక్టరేట్‌లో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నిస్తున్న విశ్వనాథరెడ్డి

ప్రజాశక్తి - కడప

తమకు న్యాయం జరగలేదంటూ కలెక్టరేట్ లోని సభా భవనంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమాల్లో విశ్వనాథ రెడ్డి అనే యువకుడు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. సభా భవన్‌లో జాయింట్ కలెక్టర్, జిల్లా అధికారుల ఎదుట ఆ యువకుడు ఒంటిపై పెట్రోల్‌ను పోసుకున్నారు. గమనించిన అక్కడ ఉన్న పోలీసులు పెట్రోల్ బాటల్‌ను లాక్కుని అతన్ని రక్షించి బయటకు తీసుకెళ్లారు. సంఘటనకు సంబంధించి బాధితుడు విశ్వనాథరెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు. 2024 అక్టోబర్ 29న ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రిలో తన భార్యకు ట్యూబెక్టమి ఆపరేషన్ చేయించానని చెప్పారు. ఆపరేషన్ సమయంలో డాక్టర్ ఇలియా రాణి తన భార్య పేగుకు రంధ్రం పెట్టి ప్రాణాపాయ స్థితికి కారణమైందన్నారు. లక్షలు డబ్బులు ఖర్చు పెట్టుకుని తన భార్యను బతికించుకున్నానని పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరానని, మూడు నెలలుగా కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేస్తున్నానని ఎవరూ పట్టించుకోలేదని వాపోయారు. తన భార్యకు ఆపరేషన్ చేసిన డాక్టర్ పై చర్యలు తీసుకోవాలని డిఎంఅండ్‌హెచ్‌ఒ నాగరాజును కోరానని, ఆయన ఆపరేషన్ చేసిన డాక్టర్ తప్పు ఏమీ లేదంటూ ఆమెను కాపాడే విధంగా రిపోర్టు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.. అనుభవం, నాలెడ్జి లేకపోవడం వల్ల ఇలా జరిగి ఉండ వచ్చునని డిఎంఅండ్‌హెచ్‌ఒ రిపోర్ట్ ఇచ్చి ఆపరేషన్ చేసిన డాక్టర్‌ను కాపాడాలని చూస్తున్నారని చెప్పారు. తన భార్యకు ఆపరేషన్ చేసిన డాక్టర్ ఇలియా రాణిని వెంటనే విధులలో నుండి తొలగించాలని కోరారు. ఆమె భర్త డాక్టర్ రవికుమార్ స్కాన్ సెంటర్ నడుపుతూ తప్పుడు రిపోర్టులు ఇచ్చి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. వీరిద్దరిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు తప్పుడు రిపోర్టు ఇచ్చిన డిఎంఅండ్‌హెచ్‌ఒ నాగరాజును విచారించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయం జరుగుతుందని స్పందన కార్యక్రమానికి వస్తే ఇక్కడ కూడా అన్యాయమే జరుగుతోందని బాధితుడు విశ్వనాథరెడ్డి వాపోయారు. వెంటనే డాక్టర్ ఇలియారాణిపైనా, తప్పుడు రిపోర్టు ఇచ్చిన డిఎంహెచ్‌ఒపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైద్య మిత్రలను కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలి

- కనీస వేతనం అమలు చేయాలి
- ఆందోళనలో జిల్లా అధ్యక్షులు విజయ్ డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆందోళన చేస్తున్న వైద్య మిత్రలు

ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో పని చేస్తున్న వైద్య మిత్రలను కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం అమలు చేయాలని వైద్యమిత్ర యూనియన్ జిల్లా అధ్యక్షులు విజయ్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని పాత కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న ఎన్టీఆర్ వైద్య సేవ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఉద్యోగ భద్రత కల్పించాలంటూ వైద్య మిత్రలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవలో 17 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న వైద్య మిత్రలకు అంతర్గత ప్రమోషన్లు కల్పించాలని పేర్కొన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ ఉద్యోగి చనిపోయిన కుటుంబాలకు రూ.15 లక్షల ఎక్స్ గ్రేసియా, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.10 లక్షలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో వెయిటేజ్ కల్పించాలని కోరారు. సిఇఒకు తమ సమస్యలను పలుమార్లు విన్నవించినా పరిష్కరిం చలేదని తెలిపారు. ఫలితంగా శాంతియుత నిరసన తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో వైద్య మిత్ర యూనియన్ జిల్లా జాయింట్ సెక్రటరీ నాగార్జునరెడ్డి, డిప్యూటీ సెక్రటరీ సుబ్బరాజు, ట్రెజరర్ భవిత, వైస్ ప్రెసిడెంట్ కవిత, వైద్య మిత్రలు పాల్గొన్నారు.

సిడిపిఒపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

సమస్యను జెసికి వివరిస్తున్న నాయకులు

ఐసిడిఎస్ పరిధిలో మైదుకూరు ప్రాజెక్టు, జీవి సత్రం సెక్టార్ గల్లా వాళ్ళ పల్లెలో అంగన్వాడీ టీచర్‌గా పని చేస్తున్న శ్రావణిని ఫేక్ రిపోర్టు ఇచ్చి మెమోల పేరుతో మానసికంగా, రాజకీయ కక్ష సాధింపుల ధోరణితో ఇబ్బం దులు గురిచేస్తున్న చాపాడు సిడిపిఒపై చర్యలు తీసుకోవాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనో హర్ జిల్లా అధికారులను డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జెసి అదితి సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ నోటిఫికేషన్ వచ్చే నాటికి శ్రావణి ఉత్తీర్ణత సాధించారని, ఏప్రిల్, మేలో ఉత్తీర్ణత సాధించిన సర్టిఫికెట్ జత చేశారని తెలిపారు. రాజకీయ కక్ష సాధింపుల నేపథ్యంలో శ్రావణిని మెమోల పేరుతో ఇబ్బందులు గురి చేయడం సరైందని కాదని పేర్కొన్నారు. మైదుకూరు సిడిపిఒ ఒరిజినల్ అని సర్టిఫికెట్ ఇస్తే, అందుకు భిన్నంగా చాపాడు సిడిపిఒ ఫేక్ అని ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటన్నారు. ఇప్పటికైనా శ్రావణిని ఇబ్బంది పెడుతున్న చాపాడు సిడిపిఒపై విచారించి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. అప్పటికి పరిష్కారం కాకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

అధ్యాపకులకు అభినందన సభ

ప్రజాశక్తి - కడప అర్బన్

గురువులతో కళాశాల యాజమాన్యం

కెఎస్ఆర్ఎం కళాశాల ఆధ్వ ర్యంలో 'అధ్యాపకుల విశేష సాధనలకు సోమవారం పుర స్కారాల పంపిణీ, అభి నందన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పరిశోధన ప్రచురణలు, సర్టిఫికేషన్లు, ఇతర విద్యా నైపుణ్యాల్లో విశేష ప్రతిభ కనబరిచిన అధ్యాపకులకు గౌరవాభివందనలు అందజేయడంతో పాటు, ప్రోత్సాహక నగదు బహుమతులు కూడా పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఎస్.ఎస్ మూర్తి మాట్లాడుతూ తమ అధ్యాపక బృందం చేస్తున్న పరిశోధనలు అగ్రశ్రేణి సర్టిఫికేషన్లు విద్యార్థులకు కొత్త అవకాశాలను అందిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ పురస్కారాలు వారి ప్రతిభను మరింత పదునెక్కించేందుకు ఉద్దేశించబడ్డాయని చెప్పారు. ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ఎమ్‌డి డాక్టర్ కె. చంద్ర ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ గురువులు నాణ్యతతో కూడిన విద్యను అందించడమే కాదు, పరిశోధన, నవీన ఆవిష్కరణల్లో భాగస్వామ్యం కావడం ఎంతో అవసరమని తెలిపారు. ఇలాంటి ప్రోత్సాహక కార్యక్రమాలు మరింత ఉత్సాహాన్ని కలిగిస్తాయని చెప్పారు. కె. మదన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ జ్ఞానం అనేది పంచుకుంటే పెరుగుతుందని పేర్కొన్నారు. పరిశోధనల ద్వారా విజ్ఞానాన్ని విస్తరించడం, నూతన ఆవిష్కరణలను ముందుకు తీసుకురావడం అధ్యాపకుల కర్తవ్యంగా మారిందని చెప్పారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ శాస్త్రీయ పరిశోధన, నూతన ఆవిష్కరణలు మాత్రమే ఒక విద్యాసంస్థను ప్రతిష్టాత్మక శిఖరాలకు తీసుకెళతాయన్నారు. డాక్టర్ ఎం. వి. నారాయణ, డీన్ – రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ మాట్లాడుతూ అధ్యాపకులు తమ పరిశోధనలను మరింత విస్తృతంగా జరిపి, విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్లు, అధ్యాపక బృందం పాల్గొని విజేతలను అభినందించారు.

మున్సిపల్, రిమ్స్ కార్మికుల

సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ వినతిపత్రం

ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపల్, రిమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప రిమ్స్‌లో యూనియన్‌లో ఉన్నారని, నాయకులు కార్మికులకు అండగా ఉన్నారని యూనియన్ నాయకులను ఎ1 కాంట్రాక్టర్ ముగ్గురిని తీసివేశారని పేర్కొన్నారు. నెల నుంచి ఆందోళనలు చేస్తున్నామని తెలిపారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జివో నంబర్ 36 ప్రకారం వేతనాలు, సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని, జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులకు యూనిఫామ్ ఇవ్వాలి కోరారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కోశాధికారి గోపి, సహాయ కార్యదర్శి ఆనందరావు, అంగన్వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి, రిమ్స్ నాయకులు స్టీఫెన్, కార్మికులు పాల్గొన్నారు.

వైవీయూలో మొదలైన లా పరీక్షలు

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని మూడు, ఐదేళ్ల లా కళాశాలల విద్యార్థుల సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మూడేళ్ల ఎల్‌ఎల్‌బి 3, 5వ సెమిస్టర్లు, ఐదేళ్లకు సంబంధించి 3, 5, 7, 9వ సెమిస్టర్లు చదువుతున్న విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 572 మంది విద్యార్థులు హాజరు కాగా, మధ్యాహ్నం జరిగిన పరీక్షలను 173 మంది రాశారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. పరీక్షల ఏర్పాట్లపై చీఫ్ సూపరింటెండెంట్ ఆచార్య కాత్యాయని వివరించారు. పరీక్షల నిర్వహణలో అడిషనల్ సూపరింటెండెంట్లు డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ ముని కుమారి పర్యవేక్షించగా, పరిశీలకులుగా డాక్టర్ సుభాష్ చంద్ర, డాక్టర్ హరినాథ్ వచ్చారు. పరీక్షలు ప్రశాంతంగా కొనసాగినట్లు ఆచార్య కాత్యాయని తెలిపారు.

వర్ధంతులను జయప్రదం చేయండి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కడప అర్బన్

స్వాతంత్ర్య సమరయోధులు యువతకు స్ఫూర్తి ప్రదాతలు అయిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల వర్ధంతి కార్యక్రమాలను జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 23న దేశ స్వాతంత్రం కోసం ఉరికయ్యను ముద్దాడిన వీరులు అయినా భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల వర్ధంతి పురస్కరించుకుని జిల్లాలో వారి ఆశయాల సాధనకు కృషి చేస్తామని ప్రతినపూని సభలు ,శ్రమధానాలు,రక్తదాన శిబిరాలు వంటివి నిర్వహిస్తున్నామని యువత పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిస్తున్నామన్నారు .దేశం కోసం చిన్న వయస్సులోనే దేశభక్తిని గుండెనిండా నింపుకొని రవి అస్తమించని సామ్రాజ్యమైన బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన ధీరులు అన్నారు. వీరి త్యాగాలను నేటి యువత గుర్తించి ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. వారి త్యాగాల స్ఫూర్తితో కడప ఉక్కుని సాధించుకుందామని పిలుపునిచ్చారు. సమావేశంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు నరసింహ, విజయ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు

- ఎస్‌పికి ఫిర్యాదు చేసిన మన్సూర్ అలీఖాన్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎస్‌పికి వినతి పత్రం అందజేస్తున్న మన్సూర్

కడప నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టి. షారుక్‌పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ప్రముఖ ఆడిటర్ పి.ఖాసింఖాన్ కుమారుడు పి.మన్సూర్ అలీఖాన్ కోరారు. సోమవారం ఎస్‌పి అశోక్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగడి వీధిలో నివసించే షారుక్ మసీదు వద్ద ప్రార్థనలు నిర్వహించే సమయంలో కమిటీ సభ్యులను, మసీదుకు వచ్చేవారిని బెదిరించారని పేర్కొన్నారు. అతని వద్ద ఉన్న గన్నుతో స్పీకర్లను కాల్చడమే కాకుండా మసీదుకు వచ్చే వారిని కూడా కాలుస్తానని బెదిరించారని తెలిపారు. అతని నుంచి కమిటీ సభ్యులకు, ప్రార్థనలు చేసుకునే వారికి ప్రాణహాని ఉందని చెప్పారు. ఇటువంటి సంఘ విద్రోహ చర్యలకు పాల్పడుతున్న వ్యక్తిని చట్ట ప్రకారం శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో జన వికాస సేవా సమితి అధ్యక్షులు ఎస్‌ఎండి తాహిర్ పాల్గొన్నారు.

ముగిసిన ఎపిపిఎస్‌సి పరీక్షలు

ప్రజాశక్తి - కడప

ఎపిపిఎస్‌సి ఫారెస్ట్ రేంజ్, జూనియర్ అసిస్టెంట్ ఇఁ డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి సంబంధించి సోమవారం ఆరు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. సోమవారం ఉదయం నిర్వహించిన పరీక్షలకు 279 మంది అభ్యర్థులు, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 279 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షల నిర్వహణ ప్రత్యేక అధికారులు పర్యవేక్షించారు. పరీక్షలకు ఆరుగురు మంది లైజన్ ఆఫీసర్లు, ఆరుగు చీఫ్ సూపరింటెండెంట్‌లు విధులు నిర్వర్తించారు.

అనర్హుల ఇంటి పట్టాలను రద్దు చేయండి

డిప్యూటీ తహశీల్దార్‌కు సిపిఎం వినతి పత్రం

డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని 15వ డివిజన్ సరోజినీ నగర్ దగ్గర ఉన్న ఆచార్య కాలనీలో ఇంటి పట్టాలు, ఇళ్ల స్థలాలు భూకబ్జాదారులు యథేచ్ఛగా అమ్ముకుంటున్నారని తక్షణమే తహశల్దార్ సమగ్ర విచారణ చేపట్టాలని సిపిఎం నాయకులు కోరారు. సోమవారం కడప డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామ్మోహన్ మాట్లాడుతూ ఆచార్య కాలనీలో 30 సంవత్సరాల కిందట బడుగు, బలహీన వర్గాలకు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకున్న వారికి, క్రిస్టియన్ మైనార్టీలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారని పేర్కొన్నారు. ఇప్పుడు వాటిని కొంతమంది బినామీ పేర్లతో దొంగ పట్టాలు సృష్టించి అమ్ముకుంటున్నారని తెలిపారు. దీనిపై తహసిల్దార్, రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ జరిపి భూ కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కొంతమంది రెవెన్యూ అధికారులు భూకబ్జాదారులకు వత్తాసు పలకడంతో గతంలో ఇక్కడ పనిచేసిన తహశీల్దార్ పేరుతో దొంగ పట్టాలు సృష్టించి ఆచార్య కాలనీలో భూ కబ్జాలకు పాల్పడుతున్నారని చెప్పారు. గతంలో ఇచ్చిన కొంతమందికి పట్టా స్థలాలు ఉన్నా కూడా అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీల నాయకులు భూ కబ్జాదారులతో చేతులు కలిపి దాడులకు, దౌర్జన్యాలకు, బెదిరింపులకు దిగుతున్నారని పేర్కొన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఆచార్య కాలనీలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆచార్య కాలనీలో భూ కబ్జాలపై సిపిఎం ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళన పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి, నగర కమిటీ సభ్యులు కుమారస్వామి రెడ్డి, నాయకులు రామకృష్ణారెడ్డి, నరసింహ పాల్గొన్నారు.

అత్యాధునిక పిచ్ రోలర్ ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయం సమీపంలోని పోలీస్ క్రికెట్ స్టేడియంలో అత్యాధునిక పిచ్ రోలర్‌ను ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ సోమవారం ప్రారంభించారు. ప్రస్తుతమున్న పిచ్‌ను క్రికెట్ టోర్నమెంట్‌లకు అనుకూలంగా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా రోలర్‌ను తెప్పించారు. రోలర్‌కు ఎస్‌పి పూజ నిర్వహించి స్వయంగా డ్రైవ్ చేసి పరిశీలించారు. వర్షానికి గ్రౌండ్ తడవకుండా ఉంచేందుకు వీలుగా ఏర్పాటు చేసిన వాటర్ ప్రూఫ్ గ్రౌండ్ షీట్‌ను ఎస్‌పి పరిశీలించారు. నిరంతరం విధుల్లో ఉండే పోలీస్ సిబ్బంది క్రీడల ద్వారా నూతనోత్తేజం పొందవచ్చుని, స్టేడియంను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎఎస్‌పి(అడ్మిన్) కె.ప్రకాష్ బాబు మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది కానివారైన ఇతరులు కూడా స్టేడియంను అద్దె ప్రాతిపదికన ఉపయోగించుకోవచ్చని, వివరాలకు 9121100641, 9000144343లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి (ఎఆర్) బి.రమణయ్య, ఆర్‌ఐలు టైటస్, ఆనంద్, వీరేష్, శ్రీశైల రెడ్డి, శివరాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-వల్లూరు

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న పంచాయతీ కార్యదర్శి

మండల కేంద్రంలోని శివాలయం దగ్గర వల్లూరు యూత్ సహ కారంతో చలి వేంద్రాన్ని పం చాయతీ కార్యదర్శి శ్రీనివాసులు ప్రారం భించారు. సోమ వారం వల్లూరు యూత్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థుల పరీక్షలు ప్రారంభం కావడంతో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా బాటసారులకు ప్రజలకు చలివేంద్రం ద్వారా చల్లటి తాగునీరు అందించడం సంతోషదగ్గ విషయమన్నారు. ప్రతి సంవత్సరం వేసవి కాలంలో చలివేంద్రం ద్వారా చల్లటి తాగనీరు అందించడం సంతోషకరమని ఈ సందర్భంగా వల్లూరు యూత్‌ను అభినందించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ ఆకేటి వెంకట్ కుమార్, మాజీ ఉపసర్పంచ్ వంకదార ఆంజనేయులు, తాడిగొట్ల రమణారెడ్డి, హరి పాల్గొన్నారు.

ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించండి.!

ప్రజాశక్తి- కడప అర్బన్ : ఎండిహెచ్ షోరూం అధినేత నుంచి తమకు ప్రాణహాని ఉందని అమీన్,ఆసిఫ్ పేర్కొన్నారు. సోమవారం ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము రాయచోటి మోటార్ వెహికల్ షోరూమ్‌లో పనిచేస్తున్నామని తెలిపారు. తమపై అవినీతి ఆరోపణలు చేసి డాక్యుమెంట్లు, చెక్కులు తీసుకున్నారని తెలిపారు. ఈ విషయం తెలిసి తమతల్లి మరణించిందని ఆవేదన వ్యక్తపరిచారు. ఇప్పటికే చెక్ బౌన్స్ కేసు పెట్టి వేధిస్తున్నారని పేర్కొన్నారు. తాము ఇతరుల నుంచి రూ.30 లక్షలు అప్పు ఇప్పించామని, దానిని అడిగితే తమపై కేసులు పెడుతున్నారని తెలిపారు. అధికారుల న్యాయం చేయాలని కోరారు.

బిఇడి, ఎంఇడి పరీక్షలు షురూ

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని 15 కేంద్రాల్లో బిఇడి, ఎంఇడి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. బిఇడి పరీక్షలకు 4,463 మంది విద్యార్థులు, ఎంఇడి పరీక్షలకు 63 మంది విద్యార్థులు హాజరయ్యారు. కడపలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో, విజయలక్ష్మి బిఇడి కళాశాల పరీక్షా కేంద్రాలను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పుత్త పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు, అబ్జర్వర్లు ఆచార్య మాధవి, ఆచార్య రియాజ్ ఉన్నిసా ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించేలా చూడాలని చీఫ్ సూపరింటెండెంట్ లకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య కేఎస్వీ కృష్ణారావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా విశ్వవిద్యాలయ అబ్జర్వర్లు పర్యవేక్షణ కోసం ప్రతి కేంద్రానికి వెళ్లారన్నారు. ఈ పరీక్షలు ఈనెల 22 వరకు కొనసాగుతాయని తెలిపారు.

విద్యార్థినులకు రుణాలు ఎప్పుడో? : డిసిసి

ప్రజాశక్తి - కడప : విద్యార్థినులకు 'కలలకు రెక్కలు' పథకం ద్వారా రుణాలు ఇస్తామని చెప్పారని, ఇంతవరకు ఆ ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షులు విజయ జ్యోతి అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉమ్మడి మేనిఫెస్టో 2024లో పొందుపరిచిన మహిళా సంక్షేమం ఎప్పుడు నుంచి అమలు చేస్తారని సూటిగా ప్రశ్నించారు. స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు రూ.3 లక్షల నుండి రూ.10 లక్షల వరకు పెంచుతామన్నారని, ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. ప్రత్యేక పథకం ద్వారా పి4 మోడల్‌లో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు, కానీ ఇంతవరకు దాని ఊసే లేదని పేర్కొన్నారు. అంగన్వాడీ కార్యకర్తలకు సుప్రీంకోర్టు తీర్పు మేరకు గ్రాట్యూటీ చెల్లించలేదని, ఆశా వర్కర్లకు కనీస వేతనం పెంపు దిశగా చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు ఉద్యోగాలు చేసే మహిళలకు హాస్టల్ వసతి కల్పించలేదని తెలిపారు. పండుగ కానుకలు, పెళ్లికానుకలు పునరుద్ధరించలేదన్నారు.ఏగా డీలిమిటేషన్ జరిగితే మహిళలు అదనంగా 75 మంది దాకా అసెంబ్లీలోకి రావాలని కోరుకుంటున్నానని ముఖ్యమంత్రి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మహిళకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత మంత్రులు, మహిళా ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి 2024 మేనిఫెస్టోలో పొందుపరిచిన మహిళా సంక్షేమం పథకాలు అమలుచేయాలన్నారు.

'సీమ'పై చిత్తశుద్ధిలేదు : వైసిపి

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న రవీంద్రనాథ్‌రెడ్డి

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రాయలసీమపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదని వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. భవిష్యత్తులో రైతులు చొక్కా పట్టుకుని నిలదీసే రోజు వస్తుందన్నారు. చంద్రబాబు ఎప్పుడూ అధికారంలోకి వచ్చినా వర్షాలు పడవు, కరువు విలయతాండం ఆడుతుందని చెప్పారు. సోమవారం వైసిపి కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడారు. చంద్రబాబు గత పాలనలోనే తెలంగాణ అక్రమంగా ప్రాజెక్టులు కట్టింది అన్నారు. అప్పట్లో చంద్రబాబు ఓటుకు నోటు కేసు వల్ల ఒక్క మాట మాట్లాడలేదు అన్నారు. తెలంగాణ ప్రభుత్వం శ్రీశైలంలో 800 అడుగుల్లోనే నీటిని వాడుకుంటుందని తెలిపారు. రాయలసీమ ప్రజలను తాకట్టు పెట్టిన వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. కర్ణాటకలో ప్రాజెక్టులు కడుతున్నా ఆ నాడు చంద్రబాబు పట్టించుకోలేదు అన్నారు. కేవలం 50 రోజుల్లోనే ఇప్పుడు రాయలసీమ రిజర్వాయర్లను నింపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అందుకే వైయస్సార్ పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని పెంచారని తెలిపారు.వైయస్ జగన్ వచ్చిన తర్వాత సీమ ప్రయోజనాలను కాంక్షిస్తూ రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ చేపట్టారని చెప్పారు. విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు బిహెచ్ ఇలియాస్, నాయకులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రానికి మంచి పేరు తీసుకురావాలి

ప్రజాశక్తి-కాశినాయన : మండలంలోని ఎపి మోడల్ పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్ష కేంద్రానికి ఇన్విజిలేటర్లు మంచి పేరు తీసుకురావాలని మండల విద్యాశాఖ అధికారి నిర్మల పేర్కొన్నారు సోమవారం నుండి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలలో భాగంగా ఆమె నరసాపురం మోడల్ స్కూల్‌కు వెళ్లి ముందుగానే ఇన్విజిలేటర్లతో ప్రత్యేకంగా మాట్లాడారు అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పరీక్ష కేంద్రంలో పిల్లలను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకుండా వారికి వచ్చిన క్వశ్చన్ ఆన్సర్లు సక్రమంగా రాసుకునే విధంగా సహకరించాలన్నారు. పరీక్ష హాల్లో పిల్లలు ఏమాత్రం భయపడకుండా వారికి వచ్చింది వచ్చినట్టు రాసే విధంగా హాలులో ఒకరితో ఒకరు మాట్లాడనివ్వకుండా కాపీలకు ఎక్కడా తావు ఇవ్వకుండా పరీక్ష కేంద్రానికి మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. మొదటి రోజు పరీక్షలకు మొత్తం 236 మంది పరీక్షకు హాజరయ్యారు అన్నారు.

కార్యాలయ ఆవరణలో శుభ్రం చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

పరిసరాల శుభ్రతే ప్రధానం

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రభుత్వ కార్యాలయాల్లో పరిసరాల శుభ్రతే ప్రాధాన్యమని తహశీల్దార్ వరద కిషోర్‌రెడ్డి తెలిపారు. స్వర్ణాంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం రెవెన్యూ కార్యాలయ ఆవరణలో తహశీల్దార్ వరద కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది పరిసరాలను శుభ్రం చేశారు. చెత్త చెదారం, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ హర్షవర్ధన్ రాజు, ఆర్ఐ లక్ష్మి, ఎఎస్ఒ నవతేజ, విఆర్ఒలు రాజశేఖర్ నాయుడు, ముని ప్రసాద్, టైపిస్టు మాధవి పాల్గొన్నారు.

ప్రభుత్వానికి పట్టని రైతుల గోడు

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి పాలనలో పంటలకు ఏమాత్రం గిట్టుబాటు ధర లేదని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల గోడు పట్టడం లేదని విమర్శించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కూడా రైతుకు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవ లేదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కందికి క్వింటాకు రూ7,550 కాగా, మార్కెట్‌లో దక్కేది రూ.6,500 మాత్రమే అన్నారు. శనిగకు రూ.5,650కుగానూ రూ.5200, మినుముకు రూ.7.400కు గాను రూ.6,000, పెసరకు రూ.8662కు రూ.7,000, జొన్నకు రూ.3371కు రూ.2200, మిరపకు రూ. 1,1781కి రూ.9,000మాత్రమే రైతుకు మార్కెట్‌లో దక్కుతున్నట్లు వివరించారు. పసుపునకు గత సంవత్సరం క్వింటాకు రూ. 15,000 లభించగా, ఈసారి రూ.7,000 మాత్రమే దక్కుతుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం అడ్రస్సే లేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు తెరిచి మద్దతు ధరకు పంట ఉత్పత్తులను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతు ఖాతాకు ఈ సంవత్సరం బకాయిలతో కలిపి రూ.40,000 వేయాలని తులసిరెడ్డి కోరారు.

మాట్లాడుతున్న భూపేష్ సుబ్బరామిరెడ్డి

సొంతింటి కలను నెరవేర్చడమే చంద్రబాబు లక్ష్యం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి సి.భూపేష్ సుబ్బరామిరెడ్డి తెలిపారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ 2019-2024 సంవత్సరంలో ఇళ్ల నిర్మాణం మధ్యలో ఆగిపోయిన వాటికి ఎస్టీలకు రూ.75 వేలు, షెడ్యూల్ కులాలకు, వెనుకబడిన తరగతుల కులాలకు రూ.50వేలు ప్రభుత్వం ఇస్తుందన్నారు. వివిధ దశల్లో ఆగిపోయిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అసంపూర్తి ఇళ్ల నిర్మాణానికి అదనపు సాయం

ప్రజాశక్తి - ఖాజీపేట

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ద్వారా 2019-2024 మధ్యకాలంలో ఇల్లు మంజూరై అసంపూర్తిగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారికి ప్రభుత్వం సాయం అందిస్తుందని, సద్విని చేసుకోవాలని ఎంపిడిఒ వెంకటరమణ తెలిపారు. ఆ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ ఎస్టీ వారికి రూ.75,000, ఎస్సీ వారికి రూ.50,000, బిసి వర్గాల వారికి రూ.50 వేల చొప్పున అదనపు సాయం మంజూరు చేస్తుందన్నారు. మండల వ్యాప్తంగా వివిధ దశల్లో 217 వరకు ఇళ్లు ఉన్నాయన్నారు. ఏప్రిల్ 20 లోపు ఇంటి నిర్మాణం పూర్తి చేసుకునే వారికే ఈ అవకాశం కల్పించినట్లు ఎంపిడిఒ తెలిపారు.
ముద్దనూరు : ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనంగా ఆర్థికసాయం అందిస్తుందని ఎంపిడిఒ ముకుందారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పలు కారణాల వల్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్న ఎస్సీ, బిసి లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అందిస్తున్నట్లు తెలిపారు. అదనపు ఆర్థిక సాయం కోసం గ్రామ సచివాలయం, హౌసింగ్ కార్యాలయంలో సంప్రదించాలని ఎంపిడిఒ సూచించారు.

అనాథ వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక రాజీవ్ నగర్ కాలనీలో ఉన్న అమ్మ అనాథ వృద్ధాశ్రమంలో అన్నదానం కార్యక్రమం చేపట్టారు. కర్ణాటక హీరో డాక్టర్ పునిత్ రాజకుమార్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం తువ్వపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ అరుణకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. వృద్ధుల మధ్య కేక్ కట్ చేశారు. పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ దయానా, ఐశ్వర్య, చందు, రాజా, ఉదయ్, మణికంఠ, ఆశ్రమ నిర్వాహకుడు వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం చేస్తున్న దాతలు

రాయితీతో యంత్రాలు, పరికరాలు

రెండు రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలి.. ఈ నెలాఖరుకు అందనున్న యంత్రాలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎస్ఎంఎఎం, ఎంఐడిహెచ్ పథకాల ద్వారా మొక్కల సంరక్షణ పరికరాలను ప్రభుత్వం రాయితీ ద్వారా ఆర్థికసాయం అందిస్తోంది. ఇందుకు సంబంధించి దరఖాస్తు ప్రక్రియ జరుగుతోంది. దరఖాస్తుదారుల పేరున వ్యవసాయ భూమి ఉండాలి. ట్రాక్టర్‌కు ఏర్పాటు చేసుకునే వ్యవసాయ యంత్రాలకు దరఖాస్తుదారుడు ట్రాక్టర్ యజమాని అయి ఉండాలి. వ్యవసాయంలో యాంత్రీకరణ వినియోగాన్ని ప్రోత్సహించడానికి రైతులకు శిక్షణ ఇవ్వడంతోపాటు వారికి ప్రదర్శనలతో చూపించనున్నారు. రైతులకు రాయితీ రుణాల ద్వారా పరికరాలు, యంత్రాల కొనుగోలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకాలను అందిస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకాలు అమలులో ఉన్నాయి. రాయితీలో 60 శాతం వాటాను కేంద్ర ప్రభుత్వం, 40 శాతం వాటాను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనుంది. ఎర్రగుంట్ల మండల వ్యాప్తంగా రైతులు వీపునకు తగిలించుకొని స్ప్రే చేసే యంత్రాలు 17 మంజూరయ్యాయి. ఈ యంత్రం విలువ రూ.26,010. ఇందులో రాయితీ రూ.10వేలు ప్రభుత్వం ఇవ్వనుంది. ట్రాక్టర్‌కు బిగించుకునే మందు పంపు ఒకటి మంజూరైంది. దీని విలువ రూ.41,100 కాగా, ఇందులో 50 శాతం రాయితీ వస్తుంది. ఏడు మడకలు (ఈనాడు గొర్రు) గొర్రు 12 మంజూరయ్యాయి. ఒక్కో దాని ధర రూ.42,840, ఇందులో రాయితీ 50శాతం వస్తుంది. 9 చక్కల బీటుగొర్రు ఏడు మంజూరయ్యాయి. దీని ధర రూ.39,270కాగా, 50శాతం రాయితీ వస్తుంది. ఆటోమేటిక్ విత్తనం గొర్రు (ఆరు చెక్కల విత్తనం గొర్రు) 8 మంజూరయ్యాయి. ఒక్కో దాని ధర రూ.58140. ఇందులో 50శాతం రాయితీ ఇస్తారు. రోటోవేటర్ (భూమి దున్నే యంత్రం) ఒకటి మంజూరైంది. ఇది ఐదు అడుగులది 36 బ్లేడ్లది. దీని ధర రూ.1,45,860. ఇందులో రాయితీ రూ.46,000 మాత్రమే వస్తుంది. మిగతాది రైతు భరించాలి. వీటిపై **ఎఒ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ..** రైతులకు పరికరాలు, యంత్రాలు పొందేందుకు రెండు రోజుల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెలాఖరుకు (మార్చి) అవి వస్తాయన్నారు. ఆసక్తిగల భూమి ఉన్న రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రస్తా తొలగించాలని నిరసన

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

దర్గా వీధి 4-3-493 (15) డోర్ నెంబర్ ఇంటిలో ఉన్న ఓ వ్యక్తి రస్తాను ఆక్రమించుకొని కాంపౌండును ఏర్పాటు చేసుకున్నారు. ఆ ఇంటి వెనకవైపు ఉన్న ఇళ్ల, ప్లాట్ల యజమానులు రస్తాలో నిర్మించిన కాంపౌండ్ వాల్‌ను తొలగించి యధావిధిగా రాస్తాను కల్పించాలని సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు ఆరేళ్ల నుంచి మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. ఈక్రమంలో సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్థానికులు అన్ని ధ్రువీకరణ పత్రాలతోపాటు వినతిపత్రం అందజేశారు. ఇందుకు కమిషనర్ ఒక్కసారిగా ఫిర్యాదు చేసిన వారిపై మండిపడ్డారు. ఆరేళ్ల నుంచి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నోటీసులు ఇచ్చే విషయంలో ఫిర్యాదుదారులు కమిషనర్‌ను ప్రశ్నించారు. ఇందుకు ఆయన సరిగా స్పందించకపోవడంతో మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. తమకు న్యాయం జరిగే వరకు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తామని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న కమిషనర్ ఆక్రమణలు తొలగిస్తామని, రస్తాను యథావిధిగా కొనసాగిస్తామని కమిషనర్ రాముడు హామీ ఇచ్చారు.

నిరసన వ్యక్తం చేస్తున్న ఫిర్యాదుదారులు

నిరసన వ్యక్తం చేస్తున్న పశువైద్య జూనియర్ డాక్టర్స్

ఎండలో నిలబడి వినూత్న నిరసన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

తమకు స్టయిఫండ్ పెంచాలని 43రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న పశువైద్య విద్యార్థులు సోమవారం ఎండలో నిలబడి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. స్థానిక గోపవరం పంచాయతీ పశు వైద్య కళాశాలలో పశువైద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు రిలే నిరాహార దీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడి పశు వైద్య జూనియర్ డాక్టర్స్‌కు న్యాయం చేసి వారిని ఆదుకోవాలని కోరారు.

తహశీల్దార్‌తో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

కాలేటివాగు డ్యాం బాధితులకు న్యాయం చేయండి

ప్రజాశక్తి - చక్రాయిపేట

మండలంలోని తక్కల్లపల్లి కాలేటి వాగు బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని మండల టిడిపి ఇన్‌ఛార్జి మహేష్‌రెడ్డి వేంపల్లి తహశీల్దార్ హరినాథ్‌రెడ్డిని కోరారు. ఆ మేరకు సోమవారం ఆయన తహశీల్దార్‌ను కలిశారు. గతంలో వేంపల్లి పట్టణంలో పాలిటెక్నిక్ కళాశాల వద్ద నివాస స్థలాలు ఏర్పాటు చేశారన్నారు. ఇంకా పట్టాలు ఇవ్వలేదన్నారు. వెంటనే పట్టాలు ఇప్పించాలని కోరారు. ఇంకా కొంతమంది బాధితులున్నారని, వారికి కూడా న్యాయం చేయాలని మహేశ్వరరెడ్డి కోరారు. ఏదైనా అవసరమైతే తన దృష్టికి తెస్తే ప్రభుత్వానికి తెలియపరిచి త్వరితగతిన న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

కొత్త మద్యం దుకాణం ప్రారంభం

అద్దాలమర్రి క్రాస్ వద్ద సోమవారం కొత్త మద్యం దుకాణాన్ని మండల టిడిపి ఇన్‌ఛార్జి తాళ్లపల్లె మహేశ్వరరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైన్ షాప్ యజమాని పెద్ద మావిరెడ్డిగారి మావిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నేషనల్ హైవే రోడ్డు వనిపెంటలో నుంచే వెళ్లాలి

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు- తాటిచెర్ల 167బి నేషనల్ హైవే వనిపెంట గ్రామంలో నుంచే వెళ్లాలని రైతు సేవాసమితి జిల్లా అధ్యక్షుడు ఎవి రమణ నాయకత్వంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఆ గ్రామ ప్రజలతో డిఆర్ఒను కలిశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ మైదుకూరు- తాటిచెర్ల 167బి నేషనల్ హైవే రోడ్డు అభివృద్ధిలో మైదుకూరు నుండి పోరుమామిళ్ల వరకు వచ్చు ప్రతి గ్రామంలో పాత రోడ్డునే అభివృద్ధి చేసుకుంటూ వస్తున్న నేషనల్ హైవే అధికారులు వనిపెంట గ్రామంలోమార్పు చేశారన్నారు. కార్యక్రమంలో రైతు సేవాసమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కొవ్వూరు మస్తాన్‌రావు, కడప, మైదుకూరు నియోజకవర్గ కార్యదర్శులు బలిజపల్లి శ్రీనివాసులు, మాడిశెట్టి సదాశివుడు, కడపకు చెందిన రైతు నాయకుడు శివారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ యార్డ్ చైర్మన్ కట్టారు వీరన్న, కరంశెట్టి శివగుప్త, భూమిరెడ్డి శ్రీనివాసులు, రాజా, దుర్గాప్రసాద్, రఘు, కె.దిలీప్ పాల్గొన్నారు.

వేలంపాట నిర్వహిస్తున్న దేవస్థాన అధికారులు

వేలంపాటలో రూ.1.59 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - చక్రాయపేట

గండి క్షేత్రం ఆంజనేయ స్వామిపేరుతోఉన్న భూముల ద్వారా ఏడాదికి రూ.లక్ష 59వేలు ఆదాయం వచ్చినట్లు దేవస్థానం సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆ భూములు లీజుకు సోమవారం అధికారులు బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఇడుపులపాయిలో ఉన్న భూమి రికార్డ్ స్థాయిలో ఏడాదికి రూ.లక్ష 55 వేలు చొప్పున మూడేళ్లపాటు లీజు హక్కు పొందిన పోతిరెడ్డి మహేష్ దక్కించుకున్నారు. గతంలో ఇదే భూమి ఏడాదికి రూ.35 వేలు చొప్పున మాత్రమే ఇచ్చారని, ఈ ఏడాది మూడింతలు పెరిగినట్లు ఎసి తెలిపారు. వీరన్నగట్టుపల్లె సమీపంలో ఉన్న భూమికి తేజేశ్వర్ రూ.4వేలు, సులభ కాంప్లెక్స్‌కు వెంకటరత్నం రూ.20 వేలకు దక్కించుకున్నారు. నందిమండలం, కుమ్మరాంపల్లి ఆవరణలో ఉన్న భూములకు పాడేందుకు ఎవరు పాల్గొనలేదన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆర్కేవ్యాలీ పోలీసులు పాల్గొన్నారు.

రక్షణ లేని అల్లాడుపల్లె పాత బ్రిడ్జి(ఫైల్‌ఫొటో)

కుందూ బ్రిడ్జికి కొరవడిన రక్షణ

ప్రజాశక్తి - చాపాడు

అల్లాడుపల్లె-సీతారామపురం గ్రామాల మధ్య కుందూ నదిపై ఉన్న పాత బ్రిడ్జికి రక్షణ కరువైంది. వాహనదారులు పలు ప్రమాదాలకు గురవుతున్నారు. కొంతమంది బ్రిడ్జి పైనుండి అదుపు తప్పి పడి ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. గత ఏడాది అల్లాడుపల్లె గ్రామానికి చెందిన మహేష్ అనే వ్యక్తి స్కూటర్ అదుపుతప్పి నదిలో పడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. బ్రిడ్జి మీద నుంచి ఒక యువకుడు కింద పడి గాయాల పాలయ్యాడు. బ్రిడ్జికి ఇరువైపులా రక్షణగా ఎలాంటి ఏర్పాటు లేదు. సిమెంట్ దిమ్మెలు మాత్రమే ఉన్నాయి. ఇవి ఏమాత్రం ప్రయాణికులకు రక్షణను ఇవ్వడం లేదు. ఈ మార్గాన అల్లాడుపల్లె, చిన్న గురువలూరు, పెద్ద గురువలూరు, శ్రీరాములపేట తదితర గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు. ఆర్‌టిసి బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఇప్పటికైనా బ్రిడ్జిపై రక్షణను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఎమ్మెల్యే 'పుట్టా' చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వ్యాపారులు

తోపుడు బండ్లకు గేట్ రద్దుపై హర్షం

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని తోపుడు బండ్లకు మార్కెట్ గేటును మార్చి నుంచి రద్దు చేయడం పట్ల వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తూ.. సోమవారం రాయల్ కూడలి వద్ద టిడిపి పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, టిడిపి పట్టణ ఉపాధ్యక్షుడు యాపరాల లక్ష్మీనారాయణ, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ యాపరాల చిన్న ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బాణసంచాలు కాల్చి, థాంక్యూ కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బురుగోళ్ల చిన్న, తుపాకుల రమణ, బండి అమర్నాథ్, శివ సారధి, రామిశెట్టి కిరణ్, బెల్లం బుజ్జి, తోపుడు బండ్ల వ్యాపారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృషి అభినందనీయం

ప్రజాశక్తి - ఖాజీపేట

మైదుకూరు నియోజకవర్గానికి నవోదయ పాఠశాల మంజూరు ఏర్పాటుకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చేసిన కృషి ప్రశంసనీయం, అభినందనీయమని మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ సందుల నాగశివారెడ్డి, కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ ఇట్టెం శ్రీరాముల యాదవ్, నియోజకవర్గ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి తుట్టే రాము యాదవ్ సోమ వారం హర్షం వ్యక్తపరిచారు. విద్య, వైద్య పరంగా మైదుకూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి ఎమ్మెల్యే తీసుకున్న చర్యలను ప్రజలు హర్షిస్తున్నారని తెలిపారు.

ఆలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఉత్సవ కమిటీ చైర్మన్, ఇఒ

పచ్చదనానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడపల్లె వీరభద్ర స్వామి దేవస్థానంలో సోమవారం ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీర నారాయణ యాదవ్, ఇఒ శ్రీనివాసులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నారాయణ యాదవ్ మాట్లాడుతూ ఆలయ ఆవరణలో పచ్చదనానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఆహ్లాద వాతావరణం కల్పించేందుకు ఆలయావరణలో పచ్చదనాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భద్రకాళి సమేత వీరభద్ర స్వామి అన్నదాన సత్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం

ప్రజాశక్తి - వేంపల్లె

నేటి సమాజానికి విలువలతో కూడిన విద్య అవసరమని మహిళా ఎంట్రెప్రెన్యూర్ రమీజా, సుమ్మా పేర్కొన్నారు. స్థానిక అక్షర కళాశాలలో సోమవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు తమ కాళ్ల మీద నిలబడటానికి క్రమశిక్షణతో కూడిన విద్య చాలా అవసరమన్నారు. అమ్మాయిలకు ప్రత్యేకంగా కళాశాలను స్థాపించడం వల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థినులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. మహిళాలు ఆయా రంగాల్లో రాణిస్తున్నారనే దానికి నిదర్శనం అక్షర కళాశాల అన్నారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ విజయభారతి మాట్లాడుతూ బాలికలు ఆయా రంగాల్లో రాణించేందుకు ఇంటర్మీడియట్ విద్యతోపాటు పోటీ పరీక్షలకు కూడా శిక్షణనిస్తున్నామన్నారు. స్కాలర్‌షిప్‌లతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఫీజు భారం లేకుండా చేస్తున్నట్లు చెప్పారు. క్రీడలకూ ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. పలువురి విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అక్షర అధ్యాపకులు విజయ్ కుమార్‌రెడ్డి, సుబహాన్, ప్రదీప్‌కుమార్, షాహీదా బేగం, ప్రమీల, అరిఫా, శివకేశరి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రమీజా

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వాడండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు వాడాలని జమ్మలమడుగు మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఎపిసిఎన్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని క్యాడర్స్ పండించిన పంటల ఉత్పత్తులతో స్టాల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ మండలంలో రసాయన పురుగు మందులు వాడకుండా పంటలను పండిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిలో డిపిఎం ఆదేశాల మేరకు స్టాల్ పెట్టనున్నట్లు తెలిపారు. ప్రజలకు ఆరోగ్యకరమైన, ఆహార పదార్థాలను పండించి, వాటిని స్టాల్ పెట్టి అమ్మడం మంచి కార్యక్రమమని పేర్కొన్నారు. ఈ కూరగాయలు, ఆకుకూరలను గూడెం చెరువు, పెద్ద దండ్లూరు, సిరిగేపల్లె, సున్నపు రాళ్లపల్లె, ఎస్.ఉప్పలపాడు గ్రామంలో పండిస్తున్నారన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జిలు, ఐసిఆర్‌పిలు, ప్రజలు పాల్గన్నారు.

స్టాల్ ప్రారంభించిన ఎఒ చంద్రశేఖర్‌రెడ్డి

రాజశ్రీ 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి : కడప వారి కోర్టులో
O.S.No. 225/2024
శ్రీమతి దండే భారతి. ...వాది
Vs
1. వి.వరదరాజ & 3 ఇతరులు. ...ప్రతివాదులు
పై దావాలో 2వ ప్రతివాదికి పత్రికా ముఖముగా సమను
To,
అల్లం శేషయ్య, S/o కీ.శే.పుల్లయ్య, R/at సంగంపేట, H/o పెద్ద బెస్తవీధి, కడప నగరం.
అను మీరు 2వ ప్రతివాదిగా మరియు ముగ్గురు ఇతరుల మీద Specific Performance of Agreement of sale & Parmanent Injuction దావా సలుపగా సదరు దావా మీ యొక్క హాజరుకు గాను 08.04.2025వ తేదీకి వాయిదా వున్నది. కావున సదరు 08.04.2025వతేదీ ఉ.గం॥ 10.30 ని॥లకు మీరు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ రాజశ్రీ పై కోర్టు నందు హాజరై, పై దావాలో మీకు ఏమైనా ఆక్షేపణలు/అభ్యంతరాలు వున్న యెడల కోర్టు వారికి తెలుపుకోనంతట పై దావాను మీ పరోక్షముగా తీర్మానించెదరు.
తేది: 18/3/2025
//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//
ఎమ్.సుధాకర్ బాబ్జీ
వకీలు, కడప.

రాజశ్రీ 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి : కడప వారి కోర్టులో
E.P.No. 301/2023
O.S.No. 1133/2022
చిత్తారి హరిరాజ. ...డిహెచ్ఆర్/వాది
Vs
శ్రీమతి జక్కం మాణిక్యమ్మ. ...జెడిఆర్/ప్రతివాది
పై E.P.లో J.Dr.కు U/021 R54 CPC నోటీసు
To,
శ్రీమతి జక్కం మాణిక్యమ్మ, W/o కీ.శే.విలియం ఆల్‌ఫ్రెడ్, కొత్త డోర్‌నెం. 43/87-8, వివేకానందనగర్, ఓంశాంతి నగర్, కడప, సెల్: 94402 80109.
అను మీ మీద డిహెచ్ఆర్ తన పేర డిక్రీ ది.17.3.2023 ప్రకారం పై E.P.లో కనిన మొత్తమును రాబట్టుకొనుటకు గాను E.P. షెడ్యూల్ ఆస్థిపై జప్తు కోరుతూ, తదుపరి వేలము వేయుటకు నిశ్చయించి పై E.P.ని సలిపియున్నారు. సదరు E.P. మీ యొక్క హాజరుకు గాను 03.04.2025వ తేదీకి వాయిదా వున్నది. కావున సదరు 03.04.2025వతేదీ ఉ.గం.10.30 ని॥లకు మీరు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ రాజశ్రీ పై కోర్టు నందు హాజరై పై E.P.లో మీకు ఏమైన ఆక్షేపణలు/ అభ్యంతరాలు వున్న యెడల కోర్టు వారికి తెలుపుకోనంతట పై E.P.ని మీ పరోక్షముగా తీర్మానించెదరు.
తేది: 18/3/2025
//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//
డి.శ్రీదేవి
అడ్వకేట్, కడప.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
I.A.No.1785/23
I.A.No. 538/22
O.S.No. 351/22
గౌరు సుబ్బిరెడ్డి, S/o గౌరు వెంకట సుబ్బారెడ్డి, హిందూ, D.No.2/72, చిన్న శెట్టిపల్లె గ్రామం, రాజుపాళెం మండలం, కడప జిల్లా. ...పిటిషనర్/వాది
Vs
R1. గౌరు రమణమ్మ, W/o Late గౌరు శివరామి రెడ్డి,
R5. గౌరు సుహాసిని, W/o విజయకుమార్ (తండ్రి గౌరు శివరామిరెడ్డి),
R1 and R5 రెస్పాండెంట్లు/ప్రతివాదులు అందరూ హిందు D.No.1/ 156-A,చిన్నశెట్టిపల్లె గ్రామం, రాజుపాళెం మండలం, కడప జిల్లా.
...రెస్పాండెంట్లు/R1, R5 ప్రతివాదులు
R1 and R5 రెస్పాండెంట్లకు నోటీసు
పై నెంబరు దావా యందు 1వ ప్రతివాది అయిన గౌరు శివరామిరెడ్డి గారు గతించినందున వారి వారసులు అయిన మిమ్ములను చేర్చుటకు గాను పై I.A.ని దాఖలు చేసియున్నాడు. అట్టి I.A. యందు R1 and R5 రెస్పాండెంట్లు అయిన మీకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టు యందు 26.03.2025వ తేదీన ఉదయం 10.30 ని॥లకు హాజరు అయ్యి ఆక్షేపణలు ఉన్న ఎడల తెలుపుకొనవలెను. లేనంతట పరోక్షముగ తీర్మానించబడును.
వాయిదా : 26.03.2025
//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//
B.V.RAMANA REDDY
A. SIDDESWARAMMA
Advocates, PRODDATUR.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
I.A.No. 1784/23
O.S.No. 351/22
గౌరు సుబ్బిరెడ్డి, S/o గౌరు వెంకట సుబ్బారెడ్డి, హిందూ, D.No.2/72, చిన్న శెట్టిపల్లె గ్రామం, రాజుపాళెం మండలం, కడప జిల్లా. ...పిటిషనర్/వాది
Vs
R4. గౌరు శ్రావణ్‌కుమార్ రెడ్డి, S/o Late గౌరు శివరామిరెడ్డి, హిందు సాకిన్
R5. గౌరు సుహాసిని, W/o విజయకుమార్ (తండ్రి లేట్ గౌరు శివరామిరెడ్డి) హిందు,
రెస్పాండెంట్లు R4 and R5 అందరూ D.No.1/156-A, చిన్నశెట్టిపల్లె గ్రామం, రాజుపాళెం మండలం, కడప జిల్లా.
...రెస్పాండెంట్లు/R4, R5 ప్రతివాదులు
R4 and R5 రెస్పాండెంట్లకు నోటీసు
పై నెంబరు దావా యందు 1వ ప్రతివాది అయిన గౌరు శివరామిరెడ్డి గారు గతించినందున వారి వారసులు అయిన మిమ్ములను చేర్చుటకు గాను పై I.A.ని దాఖలు చేసియున్నాడు. అట్టి I.A. యందు R4 and R5 రెస్పాండెంట్లు అయిన మీకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టు యందు 26.03.2025వ తేదీన ఉదయం 10.30 ని॥లకు హాజరు అయ్యి ఆక్షేపణలు ఉన్న ఎడల తెలుపుకొనవలెను. లేనంతట పరోక్షముగ తీర్మానించబడును.
వాయిదా : 26.03.2025
//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//
B.V.RAMANA REDDY
A. SIDDESWARAMMA
Advocates,
PRODDATUR.